ప్రజాశక్తి

సోమవారం 5 ఫిబ్రవరి 2024 · 5 · అనంతపురం

పరిహారం కోసం ఎదురుచూపు

ఎన్నికల ప్రకటనలోపు సొమ్ము అందేనా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2023 ఖరీఫ్ పంటనష్టానికి సంబంధించి పరిహారం కోసం రైతులు ప్రభుత్వం వైపు ఎదురు చూస్తున్నారు. ఒకవైపు ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. మరి కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అది వచ్చాక పరిహారం ఏమవుతుందోనని గుబులు రైతుల్లో నెలకొంది. 2023 ఖరీఫ్‌లో జిల్లాలో తీవ్రమైన వర్షాభావం నెలకొంది. పంటసాగు కూడా 63 శాతం అయింది. 3.48 లక్షల హెక్టార్లు సాధారణ సాగుకాగా 2.18 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇందులో 1.79 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. అనంతపురం జిల్లాలో 31 మండలాలుంటే 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఇందులో పంటనష్టం అంచనాలను అధికార యంత్రాంగం రూపొందించింది.

రూ.251 కోట్లు నష్టం

అనంతపురం జిల్లాలో 1.79 లక్షల హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు అధికారులు అంచనాలు రూపొందించారు. ఇవి కాకుండా మరో 25 వేల హెక్టార్లలో మిరప పంట కూడా దెబ్బతింది. మొత్తంగా రూ.251 కోట్లు నష్టపోయినట్లు అంచనా రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. ఇందులో 81707 హెక్టార్లలో వేరుశనగ పంట దెబ్బతింది. దీనికి రూ.138.9 కోట్లు పరిహారం ప్రతిపాదించారు. ఆముదం 22312 హెక్టార్లకుగాను రూ.18.96 కోట్లు, కంది రూ.42.09 కోట్లు, పత్తి రూ.43.46 కోట్లు ఇలా మొత్తం కలిపి రూ.251.20 కోట్లు ప్రతిపాదించారు. ప్రభుత్వం కూడా 2024 సంక్రాంతి నాటికి పరిహారం అందజేస్తామని ప్రకటించింది. కాని ఇప్పటికి వరకు అధికారిక ప్రకటనే చేయలేదు. దీంతో ఎప్పటికి పరిహారం అందుతుందని రైతులు ఎదురు చూస్తున్నారు. కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడే అవకాశాలుండడంతో ఆ తరువాత పరిహారం ఇచ్చే అవకాశం ఉండదు. ఎన్నికల తరువాత వచ్చే ప్రభుత్వం ఏ రకంగా ఉంటుందోనని సందేహాలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం తక్షణం పంటనష్ట పరిహారమివ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈనెల ఏడున కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా

రైతులకు పరిహారం అందజేయాలని కోరుతూ ఈనెల ఏడవ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు సిపిఎం ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి నాటికే పరిహారం అందజేస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. కాని ఇంత వరకు పరిహారం రాలేదు. ఇప్పటికైనా ప్రకటించి రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల ఏడున జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. దీనికి రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో...

పైసా వసూల్

- మితిమీరిన మామూళ్ల దందా..!
- పెత్తనం చెలాయిస్తున్న కిందిస్థాయి ఉద్యోగి
- అందరికీ వాటాలు పంచాలంటూ వ్యాఖ్యలు
- వెనుకేసుకొస్తున్న ఉన్నతాధికారి

కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రజాశక్తి కదిరి అర్బన్

కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచాల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందన్న విమర్శలు పట్టణంలో బలంగా వినపడుతున్నాయి. కార్యాలయంలో అవినీతి అక్రమాలను అరికట్టే అధికారి గాని ప్రజాప్రతినిధి గాని కనిపించలేదని బాధితులు వాపోతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కనుసన్నల్లో కిందిస్థాయి ఉద్యోగి ద్వారా అవినీతి తారాస్థాయిలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ జరుగుతున్న అవినీతి బాగోతానికి సంబంధించిన విడియోలు రెండు రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత జిల్లా అధికారులు గాని, ఉన్నతాధికారులు కాని స్పందించిన దాఖలాలు కన్పించలేదు. కార్యాలయంలో ఏం జరగాలన్నా తన ప్రమేయం ఉండాల్సిందేనని కార్యాలయంలో పనిచేసే కిందిస్థాయి ఉద్యోగి బాహాటంగా చెప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. కార్యాలయంలో తాను చెప్పిందే వేదం అని వేలాది రూపాయలు వసూలు చేస్తూ కార్యాలయ అధికారుల నుంచి జిల్లా అధికారుల వరకు పంచాల్సిన బాధ్యత కూడా తనదే అని కొంతమంది వద్ద నగదు తీసుకుంటున్న సమయంలో ఆ ఉద్యోగి చెప్పుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడాన్ని బట్టి చూస్తే ఆ ఉద్యోగి వ్యాఖ్యలు నిజమైనట్లే కదా అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కార్యాయంలో జరిగిన లావాదేవీలను ఆడిట్ చేసేందుకు వచ్చిన అధికారులు తమ పరిశీలనలో కార్యాలయంలో ప్రభుత్వానికి కొంతవరకు నష్టం కలిగించిన విధంగా పనులు జరగాయని బయట పడినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై వారు హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు కేంద్ర బింధువు అయిన ఆ కిందిస్థాయి ఉద్యోగి కొంతమంది వద్ద నోరుజారి చేసిన వ్యాఖ్యలతో కూడిన విడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కార్యాలయంలో వస్తున్న అక్రమ సంపాదన స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులకే పంచడానికి సరిపోతుందని అయన అన్నట్లు ఉన్న విడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అయితే ఈ తతంగం అంతా సంబంధిత జిల్లా అధికారులకు గానీ రాష్ట్రస్థాయి అధికారులకు గానీ తెలియకుండా ఉంటుందా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ తెలిసి కూడా తెలియనట్లు వ్యవహరిస్తున్నారా అన్న ఆరోపణలు కూడా వినపడుతున్నాయి. కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచవతారం ఎత్తిన కొంతమది సిబ్బంది రిజిస్ట్రేషన్ల ఈసీ, ఆర్‌హెచ్ నకలు తదితర సేవల అవసరం కొరకు వచ్చిన వారి నుండి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము తోపాటు లంచం రూపంలో అదనంగా రెండింతలు,మూడింతల సొమ్మును వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఈ లంచావతారాల వల్ల సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముడుపులు ముట్టజెప్పిన వారికి నిర్ణీత సమయంలో అన్ని సేవలు అందుతాయని మిగిలిన వారు నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరగవలసి వస్తుందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబందిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి అవినీతి అక్రమాల ఆరోపణలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కదిరి ప్రజలు కోరుతున్నారు.

కదిరి సబ్‌రిజిస్ట్రార్ వివరణ : సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయన్న విమర్శలపై సబ్‌రిజిస్ట్రార్ అధికారి శిరీషకి ప్రజాశక్తి వివరణ కోరగా ఆమె అస్పష్టమైన సమాధానమిచ్చారు. మందుల కోసం ఇచ్చిన డబ్బులు తీసుకున్నారని అన్నారు. తమ కార్యాలయంలో ఎలాంటి అవినీతి జరగలేదని అన్నారు.

జిల్లాకు నాలుగు పోస్టులా..?

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మెగా డీఎస్సీ కోసం జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తుంటే కేవలం నాలుగు పోస్టులు మాత్రమే ప్రకటించి తీవ్ర అన్యాయం చేయడం బాధాకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. 25 వేల మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులను ఊరిస్తూ వచ్చి చివరికి ఆరు వేల పోస్టులు ప్రకటించారు. అందులో కూడా నాలుగు వేల పోస్టులకే క్లియరెన్స్ ఇవ్వడం ఏంటని అన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, విద్యా అనుబంధ రంగాల పోస్టులన్నీ భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షనేతగా జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసిన సందర్భంలో తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగులకు కానుకగా ఇస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. నిరుద్యోగ యువత ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, కానీ రాష్ట్ర చరిత్రలో ఏనాడు లేని విధంగా ఈ ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ ప్రకటించలేదన్నారు. సుదీర్ఘకాలంగా యువజన సంఘాలు, నిరుద్యోగ యువత పోరాడిన ఫలితంగా కంటి తుడుపు చర్యగా 6,100 పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారని తెలిపారు. ఇవి కూడా అన్ని జిల్లాలు, కేటగిరీలను సమగ్రంగా రూపొందించలేదన్నారు. డీఎస్సీ ప్రకటించిన వాటిలో కూడా అనేక నిబంధనలు పెట్టారని విమర్శించారు. ఎప్పుడో రద్దు చేసిన అప్రెంటిస్ విధానాన్ని పునఃప్రవేశపెట్టి రెండేళ్ల గౌరవ వేతనం ఇస్తామని చెప్పడం అన్యాయంగా ఉందన్నారు. గడిచిన నాలుగేళ్లుగా కొత్తగా ఉద్యోగాల కోసం నిరుద్యోగులు రూ.లక్షలు ఖర్చు పెట్టి కోచింగ్‌లు తీసుకుని నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రకటించిన సంఖ్యను చూసి లక్షలాది మంది యువత నిరుత్సాహం చెందుతున్నారని తెలిపారు. జిల్లాలో వివిధ రకాల ఉపాధ్యాయ పోస్టులు వేల సంఖ్యలో ఉన్నాయని, ఇవి గాక రానున్న జూన్‌లో మరిన్ని పోస్టులు ఖాళీ అవుతున్నాయని తెలిపారు. కాగా కలెక్టర్ ఆఫీస్ వద్ద డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో డీఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులు చేపట్టిన ఆందోళన సందర్భంగా పోలీసులు పెట్టిన కేసులు వెంటనే ఉపసంహరించాలని జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.

డీఎస్సీ నిరుద్యోగులపై కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డిఎస్సీలో తక్కువ పోస్టులు భర్తీ చేయడాన్ని నిరసిస్తూ డీఎస్సీ నిరుద్యోగులు చేపట్టిన ఆంధోళనల నేపథ్యంలో నమోదు చేసి అక్రమ కేసులను ఎత్తివేయాలని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీనరసింహా, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో టిఎన్ఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ 6100 పోస్టుల్లో జిల్లా అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తమకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించినందుకు ప్రభుత్వం పోలీసులతో అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. తక్షణమే కేసులన్ని ఎత్తి వేయాలన్నారు. మరోసారి పరిశీలించి మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ జారీ చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి పర్యటనలను అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు కప్పల నరేష్, వీరనంద, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేనెవరో తెలుసా : 'మెట్టు'

మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం : 'నేను ఎవరో తెలుసా.. నా పేరు మెట్టు గోవిందరెడ్డి.. నేను వైసిపి నియోజకవర్గ సమన్వయకర్తను' అని మెట్టు గోవిందరెడ్డి పరిచయం చేసుకున్నారు. ఆదివారం రాయదుర్గంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వైఎస్ఆర్ ఆసరా 4వ విడత మెగా చెక్కు పంపిణీ కార్యక్రమంలో మెట్టు గోవిందరెడ్డి పరిచయం చేసుకోవడం ఆసక్తికరంగా కనిపించింది. అంతేగాకుండా గతంలో తాను తాను ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పని చేశానన్నారు. ప్రస్తుతం ఏపీఐఐసీ అధ్యక్షులుగా, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తగా ఉన్నట్లు చెప్పుకొచ్చారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే తిరిగి సీఎంగా జగన్‌ను ఎన్నుకోవాలని కోరారు. అంతేగాకుండా తనను శాసనసభ్యులుగా ఎన్నుకోవాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు.

అధికారం శాశ్వతం కాదు : 'కాపు'

మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం : అధికారం శాశ్వతం కాదని.. ఎంతటి వారైనా ఎప్పుడో ఒకప్పుడు మాజీలు కాక తప్పదని విప్ కాపు రామచంద్రారెడ్డి చెప్పారు. వైఎస్ఆర్ ఆసరా 4వ విడత మెగా చెక్కు పంపిణీ కార్యక్రమంలో కాపు రామచంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఎందుకంటే వచ్చే సాధారణ ఎన్నికల్లో వైసిపి తరుపున మెట్టు గోవిందరెడ్డిని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాపు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అంతేగాకుండా తాను ప్రజాప్రతినిధిగా ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకున్నానన్నారు. అయితే నిన్న ఓ పెద్దమనిషి అనవసరంగా తాను ఊరుకున్నానని ఇష్టం వచ్చినట్లు మాట్లాడారన్నారు. 'నాకు శాసనసభ్యుడుగా ఇది ఆఖరి రోజులు కావచ్చు.. కానీ రేపు నీవు కూడా మాజీ కాక తప్పదు' అన్నారు. అలాగే 'అన్న నన్ను గుర్తుపట్టావా.. నేను ఎవరో తెలుసా.. అని నేను ప్రజలను అడగనవసరం లేదు' అన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

7న కలెక్టరేట్ ఎదుట దర్నా

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వర్షాభావం వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ ఈనెల 7వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది వర్షాభావం వల్ల జిల్లాలో ఐదు లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోయాయని, జరిగిన నష్టంలో పావు వంతు కూడా పరిహారం ప్రకటించలేదన్నారు. జిల్లా రైతులకు ప్రభుత్వం రూ.251 కోట్లు పరిహారం ప్రకటించి నాలుగు నెలలు అవుతున్నప్పటికీ ఒక్క రూపాయి రైతు ఖాతాలకు జమ కాలేదన్నారు. సంక్రాంతి పండుగ నాటికి రైతు ఖాతాలకు జమ చేస్తామని సిఎం జగన్ ప్రకటించినా ఫలితం శూన్యమన్నారు. బటన్ నొక్కిన లెక్కలు చెబుతున్న సిఎంకు ప్రకటించిన పంట నష్టపరిహారం నిధులు విడుదల చేసే విషయం గుర్తు లేదా.. అని ప్రశ్నించారు. నిధుల విడుదల చేయకపోవడంపై జిల్లా ప్రజా ప్రతినిధులు స్పందించాలన్నారు. ఎన్నికల ప్రకటన వస్తే ప్రకటించిన పరిహారం కూడా అందదని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పంట నష్ట పరిహారం వెంటనే రైతు ఖాతాలకు జమ చేయాలని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈనెల 7వ తేదీ కలెక్టర్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాకు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంగన్వాడీల అభినందన సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

నేడు సర్వసభ్య సమావేశం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాఘవరెడ్డి అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దస్తగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

హామీలు అమలు చేయాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమ్మె కాలంలో అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు జిల్లాలో 42 రోజులుగా చేపట్టిన నిరవదిక సమ్మె విజయంవంతం కావడానికి సహకరించిన ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, అధికారులు, న్యాయం చేయడానికి అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ అంగన్‌వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలో అభినందన సభ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభకు ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు హాజరయ్యారు. ఈ సభలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా కోశాధికారి టి.గోపాల్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మాజీ నాయకురాలు లలితమ్మ, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, సిఐటియు ఆఫీస్ బేరర్స్ మన్నీల రామాంజినేయులు, కే.నాగభూషణం, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, జిల్లా నాయకులు ఆర్‌వి.నాయుడు, వి.రామిరెడ్డి, అచ్యుత్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాల రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సూరి, ఎం.క్రిష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జి.ఓబులు మాట్లాడుతూ అంగన్‌వాడీల నిరవదిక సమ్మె చరిత్ర సృష్టించిందన్నారు. 42 రోజుల పాటు వినూత్న రీతిలో ఐక్యమత్యంగా అంగన్‌వాడీలు చూపిన పోరాట పటిమ ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం చివరకు దిగిరాక తప్పలేదన్నారు. చర్చల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. తక్షణమే జీవో జారీ చేసి త్వరితగతిన ఆ ఫలాలు అంగన్‌వాడీలకు అందేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కష్టమొచ్చినా నష్టమొచ్చిన మేమున్నామంటూ సిఐటియు నాయకత్వం అండగా నిలిచిందన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర, కేంద్ర నాయకత్వం వరకు అంగన్‌వాడీల పక్షాన పోరాడారని, ఆ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల సిఐటియు నాయకులు శివశంకర్, పోతులయ్య, నాగేంద్ర, రమేష్, లోకేష్, మల్లికార్జున, ఆటో యూనియన్ నాయక్ నాయకులు ఆజాంబాషా, ఆది, సురేష్, చంద్రశేఖర్ అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున, నాయకులు పాతక్క, మేరి, ధనలక్ష్మి, రేష్మా, కాత్యాయని, అరుణ, శ్రీదేవి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి పలు ప్రభుత్వ పథకాలు

అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సి.సూర్యనారాయణ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కార్మికుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సి. సూర్యనారాయణ పేర్కొన్నారు. కార్మిక సంక్షేమ పథకాలు, చట్టాలపై అవగాహన లేని పలువురు కార్మికులు కేవలం తమ రెక్కల కష్టం పైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అసంఘటిత కార్మికులకు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్మిక చట్టాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అయితే గ్రామీణ ప్రాంతాలలో అవగాహన లేని కార్మికులు ఆ ఫలాలను అందుకోలేకపోతున్నారన్నారు. అలాంటి వారు ప్రమాదవశాత్తు అంగవైకల్యంతో బాధపడేవారు కొందరైతే, మృతిచెందిన వారి కుటుంబాలు మరికొన్ని ఉన్నాయన్నారు. అలాంటి బాధితుల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాలు వాటి అమలు తీరుపై జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.సూర్యనారాయణ ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను తెలియజేశారు.

ప్రశ్న : భవన నిర్మాణ, ఇతర పనులు చేసే కార్మికుల సంక్షేమం కోసం మీ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు ఏమిటి.?

జవాబు : అసంఘటిత కార్మికులు సామాజిక భద్రత, ప్రమాద బీమా, అంగవైకల్యం పొందిన వారికి ఆర్థిక సహాయం, కార్మిక కుటుంబాలలోని ఇద్దరు కుమార్తెలకు పెళ్లి కానుక తదితర ప్రయోజనాలు పొందవచ్చు. అయితే కార్మిక శాఖలో గుర్తింపు పొందిన వారికి మాత్రమే ఈ ప్రయోజనాలు వర్తిస్తాయి. ప్రతి కార్మికుడు కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డు పొందాల్సి ఉంటుంది.



ప్ర : గుర్తింపు కార్డు పొందేందుకు ఏయేరంగంలోని కార్మికులు అర్హులు?

జ : వ్యవసాయ మరియు అనుబంధ ఉపాధుల్లో పనివారు, చిన్న సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యానవన పనివారు, నర్సరీలు, పాడి పరిశ్రమ, మత్స్యకారులు, భవన నిర్మాణ కార్మికులు వాటి అనుబంధ రంగాలలో పనిచేసేవారు, త్రవ్వకం, రాళ్లు కొట్టే పని, సెంట్రింగ్, ప్లంబింగ్, శానిటరీ, పెయింటర్స్, టైల్స్ పనిచేసేవారు, ఎలక్ట్రిషన్, వెల్డింగ్, ఇటుక, సున్నం బట్టీలు, కాంక్రీట్ మిల్లర్, బావులు తవ్వడం, పూడిక తీయడం, టైలరింగ్‌లో పనిచేసేవారు. అలాగే ఆటోమొబైల్ రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లు హెల్పర్లు, చేనేత, కమ్మరి స్వర్ణకారులు, కుమ్మరి, క్షౌరవత్తి, చర్మకారులు రజకులు, వీధి దీపాలు చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారాలు, కల్లుగీత కార్మికులు, పాచి పని చేసేవారు, ఎన్‌ఆర్ఈజీ వర్కర్లు మిడ్ డే మీల్స్ వర్కర్లు, ఆశాలు, వలస కార్మికులు వీరంతా గుర్తింపు కార్డులకు అర్హులు అవుతారు.

ప్ర : గుర్తింపు కార్డులు ఎక్కడ పొందాలో తెలపండి?

జ : 16 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు, ఆదాయపన్ను చెల్లించనివారు, ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ మరియు స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) సదుపాయం లేని వారు ఈ గుర్తింపు కార్డు పొందవచ్చు. ఈ కెవైసి కలిగిన ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబర్ ఇవ్వవలసి ఉంటుంది. వీరు సమీప గ్రామ వార్డు సచివాలయాలు, కామన్ సర్వీసెస్ సెంటర్ లో నమోదు చేయించుకోవచ్చు. నమోదుకు ఎలాంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదు. మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

ప్ర : గుర్తింపు కార్డు పొందిన కార్మికులకు కలిగే ప్రయోజనాలు వివరించండి ?

జ : కార్మికుని ఇంటిలో ఇద్దరు కుమార్తెల వివాహానికి 20 వేలు చొప్పున మంజూరు, కార్మికుని భార్య లేదా కుమార్తెల ప్రసూతి ఖర్చులకోసం 20 వేలు సహాయం, కార్మికుడు లేదా కార్మికురాలు సాధారణ మరణం పొందితే రూ.60 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ. 5 లక్షలు బీమా, అంగవైకల్యం చెందితే అంగవైకల్యం శాతం బట్టి బీమా సౌకర్యం ఉంటుంది. నైపుణ్యం పెంపొందించే శిక్షణలు కూడా ఇవ్వడం జరుగుతుంది. 15 రోజులపాటు ఇచ్చే ఈ శిక్షణలో రోజు స్టైయి ఫండ్ కూడా ఇవ్వడం జరుగుతుంది. గుర్తింపు కార్డు పొందిన కార్మికులు ప్రతిఏటా రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది.

ప్ర : జిల్లాలో ఎక్కడెక్కడ మీ శాఖలు ఉన్నాయి? సిబ్బంది కొరత ఏమైనా ఉందా ?

జ : జిల్లాలో ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురంలలో మా శాఖలు ఉన్నాయి. సిబ్బంది కొరత అంటూ ఏమీ లేదు. సత్యసాయి జిల్లా కేంద్రంలో జిల్లా కార్యాలయం ఏర్పాటు చేయాల్సుంది. ప్రభుత్వం



అందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్ర : ఇప్పటివరకు జిల్లాలో ఎంతమంది కార్మికులు నమోదు కాబడ్డారు? కార్మికులకు మీరు ఇచ్చే సలహా ఏమిటి?

జ: జిల్లాలో 36 వేల మంది కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వారందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేశాం. అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని, సహకారాన్ని, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం. గుర్తింపు కార్డు నమోదు ఉచితంగా చేసుకోవచ్చు. ఇంకా నమోదు చేయించుకోని కార్మికులు వెంటనే తమ పేరు నమోదు చేసుకుని పథకాలు పొందాలని కోరుతున్నాం.

'బాబు' మోసం చేస్తే..జగన్ అండగా నిలిచారు..

'వైఎస్ఆర్ ఆసరా' సభలో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

అలివిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేస్తే.. తర్వాత అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి అండగా నిలిచారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అనంతపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 'వైఎస్ఆర్ ఆసరా' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం చేసిందనానరు. వివిధ సంక్షేమ పథకాలకు 125 సార్లు బటన్ నొక్కి రూ.2.53 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మంది మహిళలకు ఇంటిపట్టాలు ఇచ్చారన్నారు. ఆర్థిక స్థోమత లేకుంటే పిల్లలను చదివించలేమని భావించే జగనన్న 'అమ్మ ఒడి' పథకం కింద తల్లుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నారన్నారు. 45 ఏళ్లు నిండిన మహిళలకు చేయూత పథకం ద్వారా అండగా నిలిచాడన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన కింద రూ.11వేల కోట్లు చెల్లించారన్నారు. 66 లక్షల మంది వద్ధులు, వికలాంగులు, వితంతువులకు రూ.3వేల చొప్పున పింఛన్లు అందజేస్తున్నట్లు వివరించారు. 66 లక్షల మంది రైతులకు 40 వేల కోట్లు చెల్లించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.25,500 కోట్లను వైఎస్ఆర్ ఆసరా పథకం కింద నాలుగు దఫాలుగా ఇచ్చారన్నారు. వీటితోపాటు అనేక పథకాలను అమలు చేశారన్నారు. ఇకపోతే తాను ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గంలో ప్రశాంతమైన వాతావరణ ఉందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 17 వేల ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఇవన్నీ వివిధ దశల నిర్మాణాల్లో ఉన్నాయి. ఇవికాకుండా మరో 2500 పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. అంతేగాకుండా నియోజకవర్గానికి ఐదు సబ్‌స్టేషన్లను తీసుకురాగా మరో రెండు సబ్‌స్టేషన్లకు టెండర్లు పిలిచారు. మహిళా సాధికారతలో భాగంగా అమ్మ డెయిరీ ఏర్పాటు చేశామన్నారు. 11.30 ఎకరాల్లో గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగనన్నతో అనుమతులు తీసుకుని రూ.95 కోట్లు మంజూరు చేయించి నేరుగా పిఎబిఆర్ డ్యాం నుంచి నీళ్లు తెచ్చేందుకు ప్రత్యేక పైపులైను వేయిస్తున్నామన్నారు. ఎన్నికల్లోపు పిఎబిఆర్ రిజర్వాయర్ నుంచి తుంగభద్ర జలాలు ప్రతి ఇంటికీ ఇచ్చి ఈ ప్రాంత వాసులను ఓట్లు అడుగుతామన్నారు. అలాగే జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటు చేస్తున్నారు. అనతరం జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కొళాయి ఇచ్చేందుకు చేపట్టిన పైపులైను పనులను జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయ శాంతమ్మతో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, చైర్మన్లు, డైరెక్టర్లు, గృహ సారథులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్టోర్ డీలర్లు, మండల నాయకులు, కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు..

రాయదుర్గం : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే తిరిగి ముఖ్యమంత్రిగా జగన్ చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విప్ కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్పతో కలిసి వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత లబ్ధిదారులకు మెగాచెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలన్నా, అందరికీ విద్య, వైద్యం అందాలన్నా తిరిగి సీఎంగా జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ శాసనసభ్యులుగా తాను ప్రజలను ఉద్దేశించి మాట్లాడే సమావేశం ఇదే ఆఖరిది కావచ్చన్నారు. తన పదవీకాలంలో నియోజకవర్గంలోని 90 శాతం ఇళ్లకు వెళ్లి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానన్నారు. తాను అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ప్రభుత్వం ప్రజల నుంచి పన్నులరూపంలో చెల్లించిన సొమ్ముతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చేస్తోందన్నారు. తాను వ్యక్తిగతంగా అనేక సామాజిక వర్గాలు, ఆలయాలకు లక్షలాది రూపాయలు ఆర్థికసాయం అందజేశానన్నారు. 7000 మందికి పెళ్లిళ్లు చేశానని, వేలాది మందికి కంటి ఆపరేషన్లు చేయించానన్నారు. కరోనా కష్టకాలంలో తాను, తన భార్య రాయదుర్గంలోనే ఉండి ప్రజలకు, వ్యాధిగ్రస్తులకు సేవలు చేశామన్నారు. ఎన్నికల్లోగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వలిబాషా, శ్రీనివాస్‌యాదవ్, రాయదుర్గం ఎంపిపి విద్యావతి, జడ్పిటిసి సభ్యుడు మల్లికార్జున, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఎన్‌టి సిద్దప్ప, మున్సిపల్ వార్డు సభ్యులు, ఐకెపి ఏరియా కోఆర్డినేటర్ గంగాధర్, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి, మెప్మా ఐకెపి ఆర్పీలు, కన్వీనర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాయదుర్గంలో మెగా చెక్కును అందజేస్తున్న విప్ కాపు, సమన్వయకర్త మెట్టు, తదితరులు

'ఓట్ ఫర్ ఒపిఎస్' పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ యుటిఎఫ్ జోన్ కార్యాలయంలో 'ఓటు ఫర్ ఓపిఎస్' పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కుమార్, శేఖర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు విడుదల చేసే మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేలా ఆయా పార్టీల అధ్యక్షులతోపాటు నాయకులపై ఒత్తిడి తెచ్చేందుకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. తమ సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించడంతో అధికార, ప్రతిపక్ష నాయకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్ మండలాల ప్రధాన కార్యదర్శులు ఉమాపతి, జయరాములు, రఘు, కార్యవర్గ సభ్యులు మైలార్ లింగ, సంజప్ప, నాగరాజు, బండయ్య, వేణు, ఇస్లాంబాషా, శ్రీధర్, సుధాకర్, ఎర్రిస్వామి, రాజశేఖర్, వెంకటస్వామి, పోతురాజు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మెగా కాదు.. దగా డీఎస్సీ..

టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు

ప్రజాశక్తి-నార్పల

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసింది మెగా డీఎస్సీ కాదని.. నిరుద్యోగులను దగా డీఎస్సీ అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు విమర్శించారు. ఆదివారం మండలంలోని బొందలవాడలో ఉన్న స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి విడుదల చేసింది దగా డీఎస్సీ అన్నారు. రాష్ట్రంలో 50,892 పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగుల్ని వంచించడమే అన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సిఎం జగన్ కొత్త డ్రామాకు తెర తీశారన్నారు. ఎన్నికల ముందు ప్రతిఏడు జనవరి 1న జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తానని హామీ ఇచ్చి నాలుగన్నరేళ్లు పూర్తయినా ఒక్క క్యాలెండర్ అయినా విడుదల చేశారా.. అని నిలదీశారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లేలా బొత్సా కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా చేసిన ఏటా మెగా డీఎస్సీ జాబ్ క్యాలెండర్ 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఏమయ్యాయో జగన్ సమాధానం చెప్పాలన్నారు. యువతను వంచించి రాష్ట్రాన్ని నిరుద్యోగాంధ్రప్రదేశ్‌గా మార్చాడన్నారు. టిడిపి రాష్ట్రాన్ని పెట్టుబడులకు హబ్‌గా మార్చితే జగన్ అధికారంలోకి వచ్చాక కల్తీ మద్యం అమ్మకాలతో మద్యమద్యాంధ్రప్రదేశ్‌గా, గంజాయి ఉత్పత్తిలో గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని ఎద్దేవా చేశారు. అరాచక పాలనకు నిదర్శనం వైసిపి ప్రభుత్వం అన్నారు. గంజాయి మత్తులో పడి యువత జీవితాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి మాఫియాకి, ఏపీ సర్కారు పెద్దల అండదండలున్నాయని ఆరోపించారు. జగన్ సభ కోసం విద్యార్థుల పరీక్షను వాయిదా వేయడం దారుణమన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఆలం నరసానాయుడు

ముగిసిన చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కెఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ, పిజి మహిళా కళాశాల వేదికగా ఆదర్శ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఏ1 చెస్ అకాడమీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన జాతీయ చిత్రకళా ఆర్ట్ పోటీలు, చిత్రలేఖనం పోటీలను విజయవంతంగా ముగిసినట్లు ఆర్గనైజర్ ఫైన్ ఆర్ట్స్ మాస్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం యు. వైష్ణవి, ద్వితీయ స్థానం కె.నాగమణి, తృతీయ స్థానం ఆది, ఆంధ్ర మురళి నాలుగో స్థానం నవీన్ కుమార్, జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం జగదీష్‌నాయక్, ద్వితీయ స్థానం ప్రవీణ్, తృతీయ స్థానం దీక్షిత, నాలుగో స్థానం సాయి మణిదీప్ నిలిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శంకరయ్య, తెలుగు అధ్యాపకులు అంజన్‌రెడ్డి, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్ నాయుడు, ఆదర్శ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ బోధన సిబ్బంది వినోద్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ప్రభుత్వ ఆయూష్ వైద్యాధికారి తిరుపతినాయుడు

ప్రజాశక్తి-పామిడి

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ ఆయూష్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారు ఆదివారం మండల కేంద్రంలోని షాదీఖానాలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు బాగుంటేనే అందరూ వారి పనులను విజయవంతంగా చేసుకుంటారన్నారు. చూపు లేకుంటే జీవితం అంధకారమన్నారు. కాగా లయన్స్ క్లబ్ ద్వారా పేదలకు ఆరోగ్యం అనే నినాదంతో సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఇందులో భాగంగా దాదాపు 250 మందికి పరీక్షలు నిర్వహించగా 110 మందికి ఆపరేషన్లు అవసరమయ్యాయి. వీరిని శంకర్ కంటి ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ సౌత్ ఇండియా కార్యదర్శి ఆవుల ప్రసాద్, శంకర కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ఇలాంగో, జయరామ్‌రావు, రోషన్ జమీర్, కిరణ్, సుహాన్, సెక్షావలి, సురేష్, మహేష్, శేఖర్, శంకర ఆసుపత్రి ఆర్గనైజర్ శివకుమార్, లక్ష్మీ ఆసుపత్రి సిబ్బంది, శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వి.ఎం. చౌడప్ప సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో బి.ఎం.చౌడప్ప చేసిన సేవలు మరువలేనని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాకే భాస్కర్, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి హనుమప్ప కొనియాడారు. ఆదివారం ఉరవకొండ ఎపిటిఎఫ్ జోన్ ఆధ్వర్యంలో చౌడప్పను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌడప్ప జిల్లా శాఖకు అధ్యక్షులుగా పని చేసి, విద్యారంగానికి విశిష్ట సేవలు అందించారన్నారు. ఇందులో భాగంగా ఎంతోమంది ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల శాఖ అధ్యక్షులు దాసరి పాండురంగ, విడపనకల్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి తలారి నరసింహులు, పూర్వ అధ్యక్షులు దాదా ఖలందర్, చింతా మనోహర్, సీనియర్ నాయకులు ప్రభు, టి.వేణుగోపాల్, మనోహర్, ఆదినారాయణ, అశోక్‌కుమార్, సింగాడి భాస్కర్, టి.నాగరాజు, వాల్మీకి భాస్కర్, భూమా రామాంజనేయులు, టి.రామాంజనేయులు, శర్మస్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

చౌడప్పను సన్మానిస్తున్న ఎపిటిఎఫ్‌నాయకులు

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కడదాం

ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకొచ్చిన సిఎం జగన్‌కు మళ్లీ పట్టం కడదామని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు పిలుపు నిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని బండమీదపల్లి, చక్రాయపేట, పోతురాజుకాలవ, పెరవలి, జలాలపురం, జూలాకాలువ, అలంకరాయునిపేట, కొరివిపల్లి, చీలేపల్లి, సలకంచెరువు, ఈస్ట్.నరసాపురం, చిన్న మట్లగొంది, పెద్ద మట్లగొంది, సోదనపల్లి, గోవిందురాయనిపేట గ్రామాల్లో వైసిపి నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి మరోసారి సిఎం జగన్‌తోపాటు ఎం.వీరాంజనేయులును ఆశీర్వదించాలని కోరారు. జగనన్నే మనందరి ధైర్యమని, ఎన్నికల్లో ఆయన చేసిన మంచే గెలిపిస్తుందన్నారు. అలాగే ఈనెల 10న జరగబోయే సిద్ధం సభకు భారీగా జనాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, బొమ్మన గోపాల్‌రెడ్డి, శెట్టిపల్లి నరసింహారెడ్డి, శివమ్మ, ఎంపిపి యోగేశ్వరి, శివారెడ్డి, వెంకటప్ప, నాగన్న, సరోజమ్మ, నాగవర్ధన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ముచ్చుకోట శ్రీకాంత్‌రెడ్డి, బండి లలిత, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సాంబశివారెడ్డి, వీరాంజనేయులుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

వైసిపి కార్యకర్త మృతికి నివాళి

పామిడి : మండల కేంద్రంలోని నారాయణస్వామి వీధికి చెందిన శ్రీనివాసులు (45) అనారోగ్యంతో మృతిచెందడంతో పలువురు నాయకులు ఆదివారం నివాళు లర్పించారు. శ్రీనివాసులు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానిగా, వైసిపి కార్యకర్తగా పార్టీ కార్యాక్రమాల్లో చురుగ్గా పని చేసేవారు. మృతిచెందిన విషయం తెలుసుకున్న గుత్తి మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి, పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి పామిడి సూరి, సర్పంచి నరసింహా, రామగిరి ఆదినారాయణ, చెన్నకేశవులు, సోషల్ మీడియా కో కన్వీనర్ పుల్లా సురేంద్ర, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులుకు నివాళులర్పిస్తున్న నాయకులు

పోలీస్‌స్టేషన్ తనిఖీ

పామిడి : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. తర్వాత పామిడి టౌన్‌లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి

జాతి గర్వించదగ్గ నేత కర్పూరీ ఠాకూర్

నాయీబ్రాహ్మణ ఉద్యోగులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భారత జాతే గర్వించదగ్గ నేత జన నాయక్ కర్పూరి ఠాకూర్ చరిత్రలో నిలిచిపోయారని ఆర్‌డిటి డైరెక్టర్ తిప్పేస్వామి, పలువురు వక్తలు అన్నారు. ఆదివారం నాయీ బ్రాహ్మన ఉద్యోగుల సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారతరత్న కర్పూరి ఠాకూర్‌కు వరించిన సందర్భంగా జయమూనెమ్మ కళ్యాణమండపంలో ఆత్మీక సమ్మేళనం నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట రంగయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఆర్‌డిటి తిప్పేస్వామి, నాయీ బ్రాహ్మణ మహిళ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఉమా మహేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో కర్పూరి ఠాకూర్ పోరాట పటిమ నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. స్వాతంత్రం అనంతరం రాజకీయంగా క్రమశిక్షణ పట్టుదల అకుంఠిత దీక్షతో ఆయన రెండుసార్లు బీహార్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. జననాయక్ కు 100వ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము భారతరత్న ప్రకటించడం యావత్ జాతి గర్వించదగ్గ విషయం అన్నారు. కర్పూరి ఠాగూర్ స్ఫూర్తిని ఆశయాలను కొనసాగిస్తామని నాయకులు ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు ప్రసాద్, కార్పొరేటర్ శేఖర్ బాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు సుబ్రమణ్యం, శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి విజయనగరం నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, పిడుగు శ్రీనివాసులు, శ్రీధర్ శివప్రసాద్, పోతుల రాధాకష్ణ, బండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న నాయీ బ్రాహ్మణ ఉగ్యోగులు

నేరాలు ఘోరాలు

వృద్ధుడు ఆత్మహత్య

గార్లదిన్నె : మండల పరిధిలోని పెనకచర్ల డ్యాం గ్రామానికి చెందిన బోయ సుబ్బరాయుడు (64) శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుబ్బరాయుడు, భార్య లక్ష్మీదేవితో ఉన్న మనస్పర్థలతో శనివారం రాత్రి పురుగుల మందును మద్యంలోకి కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని కుమారుడు సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మహత్యకు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మృతిచెందిన సుబ్బరాయుడు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : మండలంలోని వన్నెదొడ్డి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పామిడికి చెందిన రఫీ, నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన రవి ద్విచక్రవాహనంలో పని నిమిత్తం పామిడి నుంచి ప్యాపిలికి వెళ్తుండగా వన్నెదొడ్డి వద్ద వారి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇరువురిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వారిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ట్రోఫీ అందుకుంటున్న వాలీబాల్ విజేత జట్టు

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల విజేత నార్పల

నార్పల : ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా జిల్లాస్థాయి వాలీబాల్ విజేతగా నార్పల జట్టు నిలిచింది. అనంతపురంలోని పిటిసి మైదానంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అనంతపురం జట్టుపై నార్పల జట్టు విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. నార్పల వాలీబాల్ జట్టు పర్యవేక్షకులుగా వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్‌బాబు, నసీమాబేగం, సురేఖ వ్యవహరించారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన నార్పల జట్టు క్రీడాకారులను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా నార్పల వాలీబాల్ జట్టు విజేతగా నిలవాలని సీనియర్ క్రీడాకారులు నరేష్, రాజగోపాల్, రామంజినేయులు, ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అభినందన సభకు అంగన్వాడీలు

పామిడి : పామిడి, ఎద్దులపల్లి అంగన్వాడీ సెక్టార్ల నుంచి 14 మంది అంగన్వాడీలు అనంతపురంలో నిర్వహించిన అభినందన సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పామిడి సెక్టార్ నాయకురాలు జయంతి మాట్లాడుతూ అంగన్వాడీలు తమ హక్కుల సాధనకై గతంలో 43 రోజులు నిరసనలు తెలిపి ప్రభుత్వాన్ని ఒప్పించినందుకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఓబులు, ఆల్ ఇండియా అంగన్వాడి యూనియన్ మాజీ అధ్యక్షురాలు లలితమ్మ ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా మైదానంలో అభినందన సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అనంతపురం వెళ్తున్న అంగన్వాడీలు

రాజకీయ సమన్యాయ సభను జయప్రదం చేయండి

గుత్తి : ఎపి ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఈనెల 8న జరిగే మాదిగల రాజకీయ సమన్యాయ మహాసభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు అంజన్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు మాదిగల రాజకీయ సమన్యాయ మహాసభ చేపట్టారన్నారు. సభ కడపలో జరుగుతుందన్నారు. మహాసభకు మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కరిడికొండ శివ, ఓబులేసు, రామకృష్ణ, రామాంజనేయులు, శివరాం, అబ్బేదొడ్డి లాలెప్ప, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

వాహనాల తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మద్యం, డబ్బు తరలించకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అంతేగాకుండా ప్రతిఒక్కరూ ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పామిడిలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

పామిడి : నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని 4వ వార్డు, 10వ వార్డులో టిడిపి నాయకులు వేర్వేరుగా ఆదివారం 'బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు, మహిళలకు రక్షణ కరువైందన్నారు. ప్రజలకు మంచి భవిష్యత్తు కావాలంటే వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొమ్మ మోహనకృష్ణ, మాధవ, రంగారెడ్డి, మస్తాన్, రాము, సర్వేస్, 10వ వార్డు బూత్ కన్వీనర్ ఈడిగ గాజిలింగప్పగౌడ్, సుంకప్ప, వెంకటరమణ, రఫీ, హమాలీ గోపాల్, నల్లబోతుల ఓబులేసు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

7 నుంచి జనరల్ కౌన్సిల్ సమావేశాలు

అనంతపురం కలెక్టరేట్ : ఎపి మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్స్ ఆధ్వర్యంలో ఈనెల 7నుంచి 11వ తేదీ వరకు ఆల్ ఇండియా జనరల్ కౌన్సిల్ సమావేశాలు విజయవాడలోని ఎంబివికె భవన్‌లో నిర్వహించనున్నట్లు యూనియన్ నేతలు తెలిపారు. ఆదివారం నగరంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైట్ టు హెల్త్ అనే నినాదంతో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరికి ఆరోగ్యం అనేది హక్కుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని ఈ సమావేశాల్లో నిర్ణయించి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు. మందులు, వైద్య పరికరాలపై జిఎస్‌టి ఎత్తివేయాలన్నారు. నకిలీ నాసిరకం మందులను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అమర్‌నాథ్, మంజునాథ్, కోశాధికారి విజయ్ నాయుడు, పూర్వ రాఊ ప్రధాన కార్యదర్శి ఏజి.రాజమోహన్, కౌన్సిల్ మెంబర్ చంద్రశేఖర్, ఇషాక్, తదితరులు పాల్గొన్నారు.